

● బెల్లంపల్లి సెగ్మెంట్

బెల్లంపల్లిలోని 100 పడకల దవాఖాన

# బెల్లంపల్లి బంగారమైంది..

● రూ.200 కోట్లతో గ్రామాలకు బీటీ రోడ్లు ● వైద్యం, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
● 350 ఎకరాల్లో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ● తొమ్మిదిన్నరేళ్లలో అభివృద్ధి పనులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'బెల్లంపల్లి యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే ఈ పేరు తెలియ నోళ్లు ఉండరు. సింగరేణి సంస్థ ఇల్లందు తరువాత బొగ్గు గనులను ప్రారంభించిన రెండో ప్రాంతం. ఒకప్పుడు పాత బెలంపల్లి ఏరియాలో చెరుకు తోటలు ఎక్కువగా సాగు చేసి బెల్లం తయారు చేసేవారు. అలా ఇది బెల్లంపల్లి అయ్యింది. ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతం గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ వచ్చిన తొమ్మిదిన్నరేండ్లలో బెల్లంపల్లిలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగింది. రోడ్లు లేని మారుమూల పల్లెలకు రోడ్లు వచ్చాయి. ఈ ఒక్క నియోజకవర్గంలోనే దాదాపు రూ.200కోట్లతో రోడ్లు వేశారు. ఒకప్పుడు వర్షాకాలంలో వాగులు, కాలువలు పొంగిపొర్లి బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా నీటిలోనే కొట్టుమిట్టాడిన గ్రామాలకు ఈ రోజు బీటీ రోడ్లు వచ్చాయి. కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి మండలాల్లోని కాలువలు, వాగులపై రికార్డులు స్థాయిలో రూ.77 కోట్లతో 22 బ్రిడ్జిల నిర్మాణం జరిగింది. బెల్లంపల్లి పట్టణ ప్రజల చిరకాల వాంఛ ఇండ్లకు పట్టాలు చేతికొచ్చారు. ఇప్పటికే దాదాపు 2,500 మందికి ఈ పట్టాలు అందాయి. విద్య, వైద్య రంగాలు బలోపేతమవడంతోపాటు నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన పెరిగింది. రాష్ట్రంలోనే మారుమూల ప్రాంతమైన బెల్లంపల్లికి రెండు ఐటీ కంపెనీలు వచ్చాయి. బెల్లంపల్లి శివారులో 350 ఎకరాల్లో స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌కు ఇటీవలే మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రోగమో, నొప్పో వస్తే వైద్యానికి దూర ప్రాంతాలకు పోవాల్సిన అవసరం లేకుండా బెల్లంపల్లిలోనే రూ.16 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం 100 పడకల దవాఖాన నిర్మించింది. డయాలసిస్ రోగులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఒకప్పుడు డయాలసిస్ కోసం కరీంనగర్, ఆదిలాబాద్ వెళ్లి రోజుల తరబడి పడిగాపులు కాసి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి. కానీ.. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో కొత్త ఆసుపత్రిలోనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది. దీంతో నిరుపేదలైన డయాలసిస్ రోగులకు వ్యయప్రయాసలు తగ్గాయి.

## ఏ ఊరుకుపోయినా రోడ్డు..

రాష్ట్రంలో మరే నియోజకవర్గంలో లేనివిధంగా రికార్డు స్థాయిలో బెల్లంపల్లిలో బీటీ రోడ్ల నిర్మాణం జరిగింది. బెల్లంపల్లి-వెంకటాపూర్, తాండూర్-భీమిని, తాళ్లగురిజాల-నెన్నెల మండలాల మధ్య డబుల్ రోడ్లు వచ్చాయి. తాండూర్ మండలంలోరూ.1.80 కోట్లతో కొత్తపల్లి-కిష్టంపేట-ద్వారకాపూర్ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. వేమనపల్లి మండలంలో రూ.11 కోట్లతో 4 కిలో మీటర్ల మేర మండల కేంద్రం నుంచి బుయ్యారం వరకు రోడ్డు వేశారు. కాసిపేట మండలంలో పెద్ద ధర్మారంలో రూ.4 కోట్లతో రోడ్డు, దేవాపూర్‌లో రింగు రోడ్డు నిర్మించారు. నెన్నెల మండలంలో జంగాల్‌పేట వరకు బీటీ రోడ్డు వచ్చింది. భీమిని మండలంలో వెంకటాపూర్, తిమ్మాపూర్ మధ్య రోడ్డు నిర్మాణం పూర్తయింది. కన్నెపల్లి మండలంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పోలంపల్లికి, వీరాపూర్‌కు రోడ్లు నిర్మించారు. నియోజకవర్గంలోని ఎస్టీ గ్రామాలు బీటీ రోడ్లు వచ్చాయి. వేమనపల్లి, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో రూ.77 కోట్లతో విస్తృతంగా బ్రిడ్జిల నిర్మాణాలు జరిగాయి. వేమనపల్లి మండలంలో రూ.8 కోట్లతో నీల్వాయి వంతెన నిర్మించారు. దీంతో 20 గ్రామాల ప్రజలు చెన్నూర్‌కు వెళ్లడానికి మార్గం సుగుమమైంది. భీమిని మండలం ఎర్రవాగుపై డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4 కోట్లు, పెద్దవాగుపై రూ.4 కోట్లతో పెద్దపేటకు వెళ్లేందుకు బ్రిడ్జిలు నిర్మించారు. తాండూర్ మండలంలో దశాబ్దాల కలగా ఉన్న గంపలపల్లి బ్రిడ్జిని రూ.37 లక్షలతో నిర్మించారు. నెన్నెల మండలంలో కోనంపేట, కృష్ణపల్లి మార్గంలో మూడు బ్రిడ్జిలు, కాసిపేట మండలంలో దేవాపూర్, చింతగూడ గ్రామాల మధ్య సల్పాల వాగుపై, దేవాపూర్, గట్రావ్‌పల్లిలో రాళ్లవాగుపై బ్రిడ్జిలు నిర్మించారు.



బెల్లంపల్లిలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

## విద్య, వైద్యం బలోపేతం..

నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రితోపాటు బెల్లంపల్లి పట్టణంలో రెండు చోట్ల బస్తీ దవాఖానలు అందుబాటులోకి వచ్చాయి. కాసిపేట మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానంలో రూ.1.30 కోట్లతో కొత్త భవనం నిర్మించారు. దుబ్బగూడెం, కాసిపేట, లంబడీ తండాల్లో హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు నియోజకవర్గంలో మరో 20 హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఒక్కో దానికి రూ.20 లక్షల చొప్పున రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ, బాలుర గురుకుల కళాశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ నాలుగేళ్ల క్రితం గుర్తింపు పొందింది. బాలికల గురుకుల కళాశాల ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. కాసిపేట బాలుర గురుకుల కళాశాల బెల్లంపల్లిలోనే ఉండడం, సాంఘిక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ కళాశాల రావడంతో బెల్లంపల్లి ఎడ్యుకేషన్ హబ్‌గా రూపుదిద్దుకుంది.

## తాగునీటి గోస తీరింది..

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.31 కోట్లతో మిషన్ భగీరథ పనులు చేశారు. మూడు వాటర్ హెడ్ ట్యాంకులు, వార్డుల్లో అంతర్గత పైపు లైన్ నిర్మించారు. కాసిపేట మండలంలో ఒక ఓవర్ హెడ్ ట్యాంక్, పంప్‌హౌజ్‌తోపాటు రొట్టపల్లి చౌరస్తాలో పంప్‌హౌజ్ ఏర్పాటు చేశారు. నెన్నెల మండలంలో 19 గ్రామపంచాయితీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. దీంతో తెలంగాణ రాక ముందు ఉన్న బిందెల కొట్లాట తగ్గింది. బెల్లంపల్లి మున్సిపాలిటీ ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. పట్టణంలోని 34 వార్డుల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. ప్రతి వార్డులో ఎల్ఈడీ లైట్లతో పాటు, రద్దీ ఉండే ప్రదేశాల్లో నాలుగు బస్ షెల్టర్లను కట్టించారు. పోలీసుల ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాంటా చౌరస్తా, మున్సిపాలిటీ చౌరస్తాల్లో వాటర్ ఫౌంటేయిన్‌లతోపాటు సుందరీకరణ పనులు చేశారు. రూ.5 కోట్లతో బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేశారు. కొత్త బస్టాండ్ నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరకు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. సరస్వతీ శిశుమందిర్ నుంచి రవీంద్రనగర్ వరకు రూ. 50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. ఒక్క మాటలో చెప్పాలంటే గడిచిన ఎనిమిదిన్నరేండ్లలో బెల్లంపల్లి బంగారమైంది.

● చెన్నూర్ సెగ్మెంట్

# చెరగని ప్రగతి ముద్ర



చెన్నూర్‌లో ఇటీవల ప్రారంభించిన 50 పడకల దవాఖాన

## దశబ్దాల చెన్నూర్ రెవెన్యూ డివిజన్ కలను సాకారం చేసిన సర్కారు

● రూ.1,658 కోట్లతో లక్ష ఎకరాలకు నీరిచ్చే చెన్నూర్ ఎత్తిపోతల పథకం
● 1,200 ఎకరాల పోడు భూములకు పట్టాలు, ఐదు వేల మందికి సింగరేణి ఇండ్ల పట్టాలు
● రాష్ట్రానికే ఆదర్శంగా 'సమ్మక్క-సారలమ్మ' భవనాలు ● తొమ్మిదిన్నరేళ్లలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దాదాపు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల ప్రాంతం. మహారాష్ట్ర పక్కనే ఉన్న నక్సల్స్ కల్లోలిత ప్రాంతమని, వెనుకబాటు తనానికి చిహ్నమని 30 ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లు, 20 ఏండ్లు పాలించిన టీడీపీ-బీజేపోళ్లు చిన్నచూపు చూశారు. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి, మంత్రులుగా పని చేసినా అభివృద్ధిని పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక చెన్నూర్‌కు పట్టిన కటిక చీకట్లను పారద్రోలింది. దశాబ్దాలుగా డిమాండ్‌గానే ఉన్న చెన్నూర్ రెవెన్యూ డివిజన్ కలను సాకారం చేసింది. రూ.1,658 కోట్లతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. 50 ఏండ్లలో పరాయి పాలకులు చేయలేని పనులు, తొమ్మిదిన్నరేళ్లలో చేసి చూపించింది..' ఒకప్పుడు చెన్నూర్ అంటే పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. అన్నట్లు ఉండేది. కానీ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక చెన్నూర్ నియోజకవర్గ దశ-దిశ మారింది. చెన్నూర్ పట్టణంలో రూ.40 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.12 కోట్లతో 50 పడకల దవాఖాన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించారు. గత ప్రభుత్వాల హయాంలో ధర్నాలు, రాస్తారోకోలు చేసిన రాని చెన్నూర్ బస్సు డిపోను పనులను రూ.4 కోట్లతో చేపట్టారు. అన్నింటికీ మించి చెన్నూర్ రెవెన్యూ డివిజన్ అయ్యింది. చెన్నూర్ గోదావరి, ప్రాణహిత నదులపై కోటపల్లి, చెన్నూర్, జైపూర్ మండలాల్లో ఎత్తిపోతల పథకాలను నిర్మించి కాళేశ్వరం బ్యాక్ వాటర్ ద్వారా నియోకవర్గంలో లక్ష పైచిలుకు ఎకరాలకు సాగునీరు ఇచ్చే బృహత్తర చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. చెన్నూర్‌తోపాటు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల కోసం మందమర్రిలో 70 ఎకరాల్లో రూ.500 కోట్లతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 1,200 ఎకరాలకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఐదు వేల మంది సింగరేణి ఇండ్లకు పట్టాలు అందజేశారు. దాదాపు 102 గ్రామ పంచాయతీల్లో మహిళ సహకార సంఘాల కోసం ఒక్కో భవనానికి రూ.18 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న 'సమ్మక్క-సారలమ్మ' భవనాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.



మందమర్రిలో నిర్మించిన 'సమ్మక్క-సారలమ్మ' మహిళ భవన్

## మూడు మున్సిపాలిటీల్లో రూ.700 కోట్ల పనులు

తెలంగాణ ప్రభుత్వం ఒక్క చెన్నూర్ మున్సిపాలిటీలోనే సుమారు రూ.207.11 కోట్ల పైచిలుకు, మందమర్రి మున్సిపాలిటీలో రూ.256.40 కోట్లు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో రూ.247.01 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టింది. చెన్నూర్‌లో రూ.25 కోట్లతో జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు పెద్ద చెరువు నుంచి బుద్దారం రోడ్డు వరకు నిర్మించిన బైపాస్ పట్టణానికి మణిహారంగా మారింది. రూ.21.02 కోట్లతో 400 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మందమర్రి మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో సుమారు రూ.25 కోట్ల అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయి. రూ.29.68 కోట్లతో 560 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఒక్క ఇళ్లు కూడా నేలమట్టం కాకూడదనే సదుద్దేశంతో రూ.27.05 కోట్లతో నిర్మిస్తున్న మందమర్రి ఆర్వోబీ పనులు పురోగతిలో ఉన్నాయి. క్యాతన్‌పల్లిలో రూ.35 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఇక్కడ కూడా రూ.15.15 కోట్లతో 286 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు రూ.20 కోట్లతో అంతర్గత రోడ్లు, కాలువల పనులు జరుగుతున్నారు. చెన్నూర్‌లో 18 వార్డులు, మందమర్రిలో 24, క్యాతన్‌పల్లిలో 22 వార్డుల్లో బతుకమ్మ ప్లే గ్రౌండ్‌లు ఏర్పాటు చేశారు. మూడు మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లు నిర్మిస్తున్నారు. ఒక్కో దానికి రూ.7.20 కోట్ల ఖర్చు చేస్తున్నారు. చెన్నూర్‌లో రూ.17.52 కోట్లతో 7,629 ఇండ్లకు, మందమర్రిలో రూ.40 కోట్లతో సుమారు 4 వేల ఇండ్లకు, క్యాతన్‌పల్లిలో రూ.22 కోట్లతో 11,328 ఇండ్లకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఇవీ కాకుండా ఏడు నుంచి పదికిపైగా కేసీఆర్ మల్టీ పర్పస్ కన్వెన్షన్ హాల్స్, రూ.50 కోట్లతో కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్, మినీ ట్యాంక్ బండ్‌ల అభివృద్ధి, వైకుంఠధామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఇలా ఎన్నో పనులు చేశారు.

## వాగులపై బ్రిడ్జిలు.. కేసీఆర్ సర్కార్ పుణ్యమే..

చెన్నూర్ అంటే గుర్తుకొచ్చేది వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగడంతో నీటి మయమైన గ్రామాలే. ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి, ఊళ్లకు ఊళ్లు బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక వాగులు, వంకలపై 18 బ్రిడ్జిలు కట్టించింది. కోటపల్లి మండల ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ తుంతుంగ వాగుపై రూ.8 కోట్ల బ్రిడ్జి నిర్మించింది. దీంతో ఏదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆల్గామా, జనగామ, వెంచపల్లి గ్రామాల దశాబ్దాల కష్టాలు తొలిగిపోయాయి. ఇలా చెన్నూర్ మండలంలోని రూ.10 కోట్లతో సుద్దాల వాగు, రూ.350 కోట్లతో కిష్టంపేట, రూ.4.80 కోట్లతో సుబ్బరాంపల్లి, రూ.1.97 కోట్లతో గంగారం బ్రిడ్జి, రూ.3.86 కోట్లతో బొక్కల గుట్ట బ్రిడ్జిలను నిర్మించింది. ఒక్క కోటపల్లి మండలంలోనే రూ.25.94 కోట్లతో తొమ్మిది బ్రిడ్జిలను మంజూరు చేయించింది. ఇవే కాకుండా మరెన్నో బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు తీసుకొని పెట్టింది. ఇవేకాకుండా అనేక మారుమాల గ్రామాల్లోనూ అంతర్గత రోడ్లు, కల్వర్టులు నిర్మించింది. అనేక గ్రామాల్లో డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలను ఏర్పాటు చేయించింది. ఇదంతా గడిచిన ఎనిమిదిన్నరేళ్లలోనే చేసి, చెన్నూర్ గడ్డపై చెరగని ప్రగతి ముద్ర వేసింది తెలంగాణ సర్కారు.



జైపూర్ మండలం రసూల్‌పల్లి దగ్గర వాగుపై నిర్మించిన బ్రిడ్జి

# సిర్పూర్ అభివృద్ధిలో సూపర్

## స్వరాష్ట్రంలో దరిచేరిన సంక్షేమం, ప్రగతి

● 'సమైక్య' కన్నీళ్లను తుడిచేసిన సీఎం కేసీఆర్ సర్కారు ● పేపర్ మిల్లు ప్రారంభంతో వందలాది మందికి ఉపాధి
● వందల కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణాలు ● అందుబాటులో విద్య, వైద్యం

● సిర్పూర్ సెగ్మెంట్



ప్రాణహిత నదిపై రూ. 65 కోట్లతో నిర్మించిన వంతెన

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర సరిహద్దులో ప్రాణహితను ఆనుకొని ఉన్న చిన్న నియోజకవర్గం సిర్పూర్. సమైక్యపాలన సాగినంత కాలం ఈ ప్రాంతం చీకట్లోనే మగ్గింది. వాగులు, వంకలపై వంతెనల్లేక ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని నదుల్లో నాటుపడవలపై ప్రయాణం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం. సరైన విద్య, వైద్యం సదుపాయాలు అందుబాటులో లేక కష్టాలను, కన్నీళ్లను ఎదుర్కొన్న నియోజకవర్గం, స్వరాష్ట్రంలో అభివృద్ధిలో దూసుకుపోతున్నది. పదేళ్ల కాలంలో సిర్పూర్ నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి.

## ఎస్పీఎం పునఃప్రారంభంతో కళ

కాగజ్‌నగర్‌కు దేశంలోనే గుర్తింపు తీసుకువచ్చిన ఎస్పీఎం సమైక్యపాలనలో 2013లో మూతబడి వందలాది మంది కార్మికులు వీధినపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి విడుతలోనే ఎస్పీఎంని పునరుద్ధరించింది. పరిశ్రమ పునరుద్ధరణ కోసం ప్రత్యేకంగా రాయితీలను కల్పించింది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 1500 కుటుంబాలకు ఉపాధి కలిగింది.

## ప్రాణహితపై వంతెనతో తీరిన బాధలు

ప్రాణహితపై ప్రభుత్వం కూ. 65 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టింది. దీంతో మహారాష్ట్రతో మానవ, వ్యాపార సంబంధాలు పెరిగాయి. నాటుపడవల ద్వారా పడుతున్న బాధలు తీరిపోయాయి. నియోకవర్గంలో 2014 నుంచి 34 వంతెనల నిర్మాణం చేపట్టారు. దీనికోసం ప్రభుత్వం సుమారు రూ. 200 కోట్లు ఖర్చుచేసింది. వీటితో ఈ నియోజకవర్గంలో 95 శాతం గ్రామాలకు రవాణా వసతి కలిగింది. ఒక బొక్కివాగుపైనే తొమ్మిది చోట్ల 9 వంతెనలు నిర్మించింది. దీనికోసం రూ. 45 కోట్ల ప్రభుత్వం ఖర్చు చేసింది. స్వరాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు రూ. 100 కోట్ల తో 200 కి.మీ రోడ్లు ప్రభుత్వం నిర్మించింది. గతంలో లేని వందలాది గ్రామాలకు బీటీ రోడ్లు అందుబాటులోకి వచ్చాయి.



కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం పరిశ్రమ

## అభివృద్ధిలో పరుగులు..

గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఐటీడీఏ ద్వారా ప్రత్యేకంగా రూ. 30 కోట్లు ఖర్చు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్‌తో రూ. 40 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మించారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఉన్న కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మంత్రి కేటీఆర్ చొరువతో రూ. 50 కోట్లు వెచ్చించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు రెండు సార్లు నీటిని అందిస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ. 25 కోట్లతో వివిధ పను లు చేపట్టారు. రూ. 5 కోట్లతో కాగజ్‌నగర్ కేంద్రంలో 50 పడకల దవాఖానను నిర్మించారు. కిడ్నీ రోగుల కోసం కాగజ్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.

## సంక్షేమ పథకాలతో పేదలకు అండగా..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయి. సిర్పూర్ నియోజకవర్గంలో కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 10, 300 మందికి లబ్ధి చేకూరగా, దాదాపు రూ. 100 కోట్లు అడపిల్లల పెండ్లిళ్లకు అందించింది. ఇక సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 10 కోట్ల సాయం అందించారు.ఉచిత విద్యుత్ సరఫరా పథకం ద్వారా నియోజకవర్గంలో 2014 నుంచి ఇప్పటి వరకు 5వేల విద్యుత్ కనెక్షన్లను ప్రభుత్వం కల్పించింది. దీనికోసం రూ. 10 కోట్ల తో 8 సబ్‌స్టేషన్లు, రూ. 57 కోట్లతో కౌటాల వద్ద 132 కేవీ విద్యుత్ ప్లాంట్‌ని నిర్మించారు. నియోజకవర్గంలో 34, 900 మందికి ఆసరా పింఛన్ అందుతున్నది. దీనికోసం ఇప్పటి వరకు రూ. 436 కోట్లు అందించింది. రైతు బంధు పథకం నియోజకవర్గంలోని రైతులకు ఇప్పటి వరకు రూ. 648 కోట్లు పెట్టుబడి సాయంగా అందజేసింది. ఇక రైతు బీమా కింద ప్రభుత్వం రూ. 30కోట్లను బాధిత కుటుంబాలకు అందేలా చేసింది. ఇక దళిత బంధు ద్వారా 100 కుటుంబాలకు రూ. 10 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.



ఆసిఫాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం

# కుమ్రం భీం స్ఫూర్తితో.. ఆసిఫాబాద్ ప్రగతి

● అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న గిరిజన నియోజకవర్గం
● పల్లె పల్లెకూ రోడ్లు.. వాగులపై వంతెనలతో మెరుగుపడిన రవాణా
● చెక్‌డ్యామ్‌ల ఏర్పాటుతో 700 ఎకరాలకు సాగునీరు ● మెడికల్ కళాశాలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
● సంక్షేమ పథకాలతో నిరుపేదలకు భరోసా ● మున్సిపాలిటీతో జిల్లా కేంద్రానికి కొత్త రూపు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : సమైక్య రాష్ట్రంలో అన్నింటా వెనుకబడిన గిరిజన నియోజకవర్గం ఆసిఫాబాద్.. స్వరాష్ట్రంలో ప్రగతి బాట పట్టింది. పాలకుల పట్టింపులేని తనంతో దశాబ్దాల పాటు చీకట్లో మగ్గగా, నేడు కుమ్రం భీం స్ఫూర్తితో పరుగులు పెడుతూ అన్ని రంగాల్లో వెలుగొందుతున్నది. మెరుగైన విద్య, వైద్యం, రవాణా వసతి అందుబాటులోకి రావడంతో పాటు ఇంటింటికీ తాగు నీరు, గడప గడపకూ సంక్షేమ పథకాలు చేరుతుండగా, ఆదర్శంగా నిలుస్తున్నది.

## పల్లె పల్లెకూ రోడ్లు.. వంతెనలు..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో దాదాపు 90 శాతం గిరిజన గ్రామాలే. భీం పోరాట స్ఫూర్తితో జోడెఘాట్‌లో రూ. 25 కోట్లతో ప్రారంభమైన అభివృద్ధి.. పల్లె పల్లెకూ చేరింది. ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా రూ. 88.97 కోట్లతో 108 గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించింది. రూ. 105 కోట్లతో 24 హైలెవల్ వంతెనలు నిర్మించింది. నియోజకవర్గంలో 6 చెక్‌డ్యామ్‌లు నిర్మించి సాగునీరందిస్తున్నది. వాంకిడి మండలం సంకెపల్లి వాగుపై రూ. 3.33 కోట్లతో, ఆసిఫాబాద్ మండలం కెస్లాపూర్ వాగుపై రూ. 4.65 కోట్లతో, ఖమానా వాగుపై రూ. 3.52 కోట్లతో, వాంకిడి వాగుపై రూ. 3.33 కోట్లతో, గంగాపూర్ వాగుపై రూ. 5.77 కోట్లతో, రామగూడ వాగుపై రూ. 2.50 కోట్లతో చెక్‌డ్యామ్‌లను నిర్మించగా, సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందుతున్నది.

## రూ. 100 కోట్లతో మెడికల్ కళాశాల..

నియోజకవర్గంలో గత పదేళ్లలో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఆసిఫాబాద్‌లో రూ. 100 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి వైద్య విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా కేంద్రంలోని పీహెచ్‌సీని రూ. 7 కోట్లతో ఆధునీకరించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్నతీకరించింది. జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసింది. రూ. 54 కోట్లతో 300 పడకల ఏరియా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని జైనూర్, తిర్యాణి, కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా ఉన్నతీకరించింది.

## సంక్షేమ పథకాలతో భరోసా..

ప్రభుత్వం సంక్షేమ పథకాలతో నిరుపేదలకు భరోసానిస్తున్నది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా నియోజకవర్గంలో రూ.90 కోట్ల 45 లక్షల 44 వేల 704 అందించింది. సీఎంఆర్ లీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటి వరకు రూ. 2 కోట్ల 62 లక్షల 92 వేల 500 అందించింది. రైతు బీమా ద్వారా ఇప్పటి వరకు 224 మందికి రూ.11 కోట్ల 20 లక్షలు అందించింది. రైతుబంధు ద్వారా 47 వేల 36 మంది రైతులకు ఏడాదికి రెండు పంటలకు రూ. 152 కోట్లు అందిస్తున్నది. నియోజకవర్గంలో 100 మంది దళితులకు 'దళితబంధు' పథకం ద్వారా రూ. 10 కోట్లు అందించింది. నిరుపేదలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. 1100 మందికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించింది.



పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందిన జోడేఘాట్

● ఆసిఫాబాద్ సెగ్మెంట్




ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల

## మున్సిపాలిటీగా ఆసిఫాబాద్

సాధారణ మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్‌ను ప్రభుత్వం మున్సిపాలిటీగా మార్చడంతో కొత్త రూపు వస్తున్నది. దీంతో జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఏర్పడింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఇప్పటికే రూర్బన్ పథకం ద్వారా సుమారు రూ. కోటితో వివిధ పనులు చేపట్టారు. సుమారు రూ. 30 కోట్లతో అన్ని రకాల అభివృద్ధి పనులు చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు జిల్లాకే వన్నెతెస్తున్నాయి.